క్లుప్తంగా

పూర్ణాహుతితో ముగిసిన చవితి వేడుకలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలు సోమవారం ముగిశాయి. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని వినాయకుడి ఆలయంలో ఉదయం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనగా, ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం మృత్తికా గణపతికి నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన ఊరేగింపులో పలువురు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డు ఉంటేనే నిత్యావసర సరుకులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయి, పూట గడవక వరద బాధితులు నానా ఇక్కట్లు పడుతుంటే, వారికి నిత్యావసరాలు ఇవ్వకుండా ప్రభుత్వ సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. రేషన్ కార్డు లేకపోయినా ఆధార్ కార్డు ఉంటే బియ్యం, నిత్యావసరాలు ఇస్తున్నామంటూ ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటుండగా.. కొన్ని చోట్ల రేషన్ కార్డు ఉన్న వారికే సరుకులు ఇస్తున్నారు. దీంతో రేషన్ కార్డు లేని బాధితులు ఆకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది. చిట్టినగర్ 47వ డివిజన్ కొండ ప్రాంతంలోని టేనర్ మెమోరియల్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం 147, 148 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలకు రేషన్ కార్డ్ ఉన్నవారికి మాత్రమే సరుకులు ఇస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే.. ఆధార్‌పై ఇవ్వాలని తమకు పైనుంచి ఆదేశాలు లేవని 148వ సచివాలయం అడ్మిన్ కల్యాణి తెలిపారు. దీనిపై వరద బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వివాదానికి దిగారు. వారం నుంచి ముంపులోనే ఉంటూ తినేందుకు తిండి లేక అల్లాడి పోతున్నామని, ఈ సమయంలో ఉదారత చూపి బాధితులందరికీ సరుకులు అందించాల్సి ఉండగా సాకులు చెప్పటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పినట్లు ఆధార్‌పై ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. అడ్మిన్ కనీసం పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో బాధితులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో పక్క స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరు పడితే వారు వచ్చి రేషన్ కార్డ్ లేకపోయినా సరుకులు పట్టుకెళ్లిపోయారు. దీంతో బాధితులు ఇదేమి న్యాయమని, టీడీపీ పాలనలో చెప్పేది ఒకటి.. చేసేది ఒకటని ధ్వజమెత్తారు.

ఎక్సైజ్ ఉద్యోగికి మంత్రి కొల్లు పరామర్శ



భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ మోరు నాగరాజును ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయంగా రెండు లక్షల రూపాయలను ప్రకటించారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్, ఇతర అధికారులు నాగరాజును పరామర్శించారు. వరద నేపథ్యంలో ఈ నెల 2 నుంచి భవానీపురం స్వాతి సెంటర్ కేంద్రంగా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సహాయ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో భవానీపురం సెబ్ (ఎక్సైజ్) స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మోరు నాగరాజు ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి తాను నివసిస్తున్న గన్నవరానికి బైక్‌పై వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. భవానీపురం పీఎస్ సిబ్బంది హాస్పిటల్‌లో జాయిన్ చేశారు.

వైభవంగా శత సహస్ర మోదక గణపతి హోమం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర మహాస్వామి ఆదేశంతో శివరామ కృష్ణ క్షేత్రంలో 25 రోజులపాటు నిర్వహించే శత సహస్ర (లక్ష) మోదక లక్ష్మీగణపతి హోమం వైభవంగా నిర్వహించారు. సోమవారం నాటి కార్యక్రమాలు గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. గణపతి అథర్వ శీర్షోపనిషత్ పారాయణం 4 వేల సంఖ్యగా మోదక హవనం నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీ హోమం వల్ల సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చునని వివరాలకు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వరద ముంపులోనే పలు ప్రాంతాలు



ముంపులో విద్యాధరపురం ఆర్టీసీ డిపో



బాల యేసు చర్చి ప్రాంగణంలో వరద నీరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద వచ్చి జనజీవనాన్ని అతలాకుతం చేసి పది రోజులు కావస్తున్నా గట్టు వెనుక ప్రాంతంలో పలు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఇళ్లు మునిగిపోయి సర్వం కోల్పోయిన తమ కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి ఎన్యూమరేషన్ ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతున్న క్రమంలో మునిగిపోయిన ఇళ్లల్లో ఎలా ఉంటామని ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల దగ్గర లేకపోతే లేరని రాసుకు వెళతారు తప్ప తమ దయనీయ స్థితిని గమనించకపోతే ఎలా అని నిలదీస్తున్నారు. ఊర్మిళానగర్ పరిధిలోని ఏకలవ్యనగర్ నేటికీ ముంపులోనే ఉంది. అలాగే ఊర్మిళానగర్



కబేళా ఇండస్ట్రియల్ ఏరియాలో దుస్థితి

బ్రహ్మంగారి గుడి ఎదురు రోడ్లన్నీ జలమయమే. జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్, కబేళా సెంటర్ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. భవానీపురం చర్చి సెంటర్‌లోని బాల యేసు చర్చి, విద్యాధరపురం ఆర్టీసీ డిపో, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ ముంపు బారి నుంచి బయటపడలేదు. కబేళా రోడ్‌లోగల ఇండస్ట్రియల్ ఏరియాలోని అనేక పరిశ్రమలు వరద నీటిలో ఉన్నాయి. నిర్వాహకులు లోపలకు వెళ్లి ఏమి పోయాయో చూసుకుందామన్నా లోపలకు వెళ్లే పరిస్థితి లేదు. తాము ఇంకా ముంపులోనే ఉంటే అన్ని జిల్లాల నుంచి తీసుకువచ్చిన ఫైర్ ఇంజిన్ల వలన ప్రయోజనమేమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే ఇతర జిల్లాల్లోని ప్రజాప్రతినిధులు ఇక్కడికి వచ్చి ప్రభుత్వం అందించే సాయాన్ని ఇస్తూ ఫొటోలు దిగి ప్రచారం చేసుకోవడం మినహా ముంపు సమస్య పరిష్కారం దిశగా ఆలోచన చేసిన వారు లేరని బాధితులు మండిపడుతున్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

పటమట(విజయవాడ తూర్పు): బుడమేరు వరద ప్రభావితమైన 149 సచివాలయాల పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పూర్తి చేశామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు 66 సచివాలయాల్లో 100 శాతం పారిశుద్ధ్య పనులు చేశామన్నారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ నుంచి 32 ఐఏఎస్ ఆఫీసర్లు, 149 మంది వార్డు సచివాలయ స్పెషల్ ఆఫీసర్లుగా, పారిశుద్ధ్య నిర్వాహణకు 60 మంది నోడల్ ఆఫీసర్లు, 950 శానిటేషన్ సూపర్‌వైజర్లు, 6,830 పారిశుద్ధ్య కార్మికులతో ప్రతి రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు శరవేగంగా చేస్తున్నారన్నారు. ఆయన సోమవారం వరద ప్రభావిత ప్రాంతాలైన ఒకటో డివిజన్‌లోని గుణదల ఇన్నర్ రింగ్ రోడ్డు, 64వ డివిజన్‌లోని కండ్రిక జంక్షన్‌లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



బుడమేరు వరద పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



డ్రైయిన్లలో డీసిల్టింగ్ నిర్వహిస్తున్న వీఎంసీ సిబ్బంది

ప్రతి రోజూ స్ప్రే..

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో 234 ట్యాంకర్లతో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వాహణకు 154 ట్రాక్టర్లు, 100 టిప్పర్లు, 59 జేసీబీలు, 14 బాబ్ కాట్లు, 10 డోజర్లు, ఆరు ప్రొకెయిన్లు, రెండు క్రేన్లు, 25 కంపెక్టర్లతో మొత్తం 370 వాహనాలతో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పేరుకుపోయిన బురదను శుభ్రం చేయటానికి 110 ఫైర్ ఇంజిన్లతో 30,545 ఇళ్లను ఫైర్ గన్స్‌తో శుభ్రపరిచామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వరద నీరును బయటకు తీయడానికి 238 డి వాటరింగ్ పంపులు నిత్యం పనిచేస్తున్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 458 కిలోమీటర్ల రోడ్లలో దాదాపు 90 శాతం రోడ్లను శుభ్రపరిచారని, 574 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తీశారని, ప్రజలు అనారోగ్య పాలు కాకుండా ప్రతి రోజు బ్లీచింగ్ పౌడర్ డ్రోన్ల ద్వారా, పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చల్లిస్తున్నామని చెప్పారు. 88.62 మెట్రిక్ టన్నుల బ్లీచింగ్ పౌడర్ చల్లారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 534 కిలోమీటర్ల వరకు ఉన్న డ్రెయిన్లలో 421 కిలోమీటర్లు డీసిల్టింగ్ చేశారన్నారు. నిల్వ ఉన్న వరద నీళ్లలో 20 డ్రోన్ల సహాయంతో బయో ఎంజీమ్, మలేరియా లార్వాసైడ్ ఆయిల్ ప్రతి రోజూ స్ప్రే చేస్తున్నారని చెప్పారు.

బాబు అసమర్థతే బుడమేరు పాపం

- సాయం అందించటంలో ఘోర వైఫల్యం
- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు అసమర్థ పరిపాలనకు బుడమేరు పాపం ఒక మచ్చుతునక అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల సీనియార్టీ అని పదే పదే చెప్పుకున్నే చంద్రబాబునాయుడు బుడమేరుకు వరద వస్తుందని ముందే చెప్పినా ప్రజల ప్రాణాలను గాలికొదిలేసి మీనమేషాలు లెక్కించారని ఎద్దేవా చేశారు. బుడమేరుకు గేట్లు లేవని చెబుతున్న చంద్రబాబుకు దీనిపై ఏమి అవగాహన ఉందో అర్థమవుతుందన్నారు. ప్రధానంగా 1950వ దశకంలోనే బుడమేరుకు గేట్లు ఏర్పాటు చేసిన విషయం జిల్లా వాసులందరికీ తెలుసన్నారు. ఏ ప్రాంతాలను కాపాడటానికి, ఎవరి ఇళ్లను కాపాడటానికి బుడమేరుతో విజయవాడను ముంచారో ప్రజలకు తెలుసన్నారు.



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, పక్కన నాయకులు

బాబు కొత్త నాటకాలు..

పది రోజులైనా ఇప్పటికీ వరద సాయం అందక ప్రజలు తిరగబడుతున్నారని, వారిపై అధికారులు దాడులు చేస్తున్నారంటూ వివరించారు. చంద్రబాబు పాలనలో సరైన సాయం సైతం అందటం లేదని ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఇతర పార్టీ మంత్రులపై విమర్శలు చేస్తున్న వీడియోలు రాష్ట్ర ప్రజలందరూ చూశారని చెప్పారు. ప్రజలను ఆదుకోవటంలోనూ విఫలమయ్యారని దుయ్యబట్టారు. చిన్నారులు సైతం విషజ్వరాలతో పిట్టల్లా రాలిపోతుంటే చంద్రబాబు ప్రభుత్వం ఏమి చేస్తుందో అర్థం కావటం లేదన్నారు.

నేడు ప్రకాశం బ్యారేజీలో వైఎస్సార్ సీపీ బోట్లు తోసిందంటూ చంద్రబాబు కొత్త నాటకాలు ఆడుతున్నారని చెప్పారు. ప్రజలకు అన్ని తెలుసన్నారు. ప్రధానంగా కరోనా కాలంలో ప్రజలకు జగన్ ప్రభుత్వం ఏవిధంగా అండగా ఉన్నది యావత్ దేశం చూసిందన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు దాసీ జయప్రకాష్‌కెనడీ, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని ముంచిన బుడమేరు

- వరద ముంపులో విజయ డెయిరీ
- వెయ్యి మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- రూ.వంద కోట్ల మేర నష్టం
- రూ.65 కోట్ల విలువైన ఉత్పత్తులు నీటి పాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపు విజయ డెయిరీ(కృష్ణా మిల్క్ యూనియన్) కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. విజయ డెయిరీని వరద ముంచెత్తడంతో రూ.100 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. 9 రోజులుగా వరద కష్టాలు విజయ డెయిరీని వీడడం లేదు. ఫ్యాక్టరీలోని కీలకమైన ప్యాకింగ్, కూలింగ్, స్టోరేజీ, విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. గత ఆదివారం నుంచి ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇక్కడి నుంచి నగరానికి పాల సరఫరా నిలిచిపోయింది. ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పని చేయాలంటే మరో నెల రోజులైనా పట్టే అవకాశం ఉంది. ఫ్యాక్టరీలో వెయ్యి మంది పనిచేస్తుండగా వీరిలో 50 శాతం కార్మికులు, మిగిలిన వారు ఉద్యోగులు ఉన్నారు. ఇందులో పనిచేసే కార్మికులు, కాంట్రాక్టు సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. డెయిరీలో పని చేసే ఉద్యోగులను యాజమాన్యం ఏదో రీతిన ఆదుకునే అవకాశం ఉండగా, వారం పైగా ఉపాధి లేక కార్మికుల కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో సిద్ధమయ్యే వరకు తమ జీవనం సాగించేదెలా అని వాపోతున్నారు. మహిళా కార్మికుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. మహిళలు తమ పిల్లల చదువులకు, పెళ్లిళ్ల కోసం, యువకులు చదువుల కోసం పార్ట్‌టైమ్‌గా పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేంత వరకు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో సిబ్బంది..

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామాల్లో పాడి రైతుల నుంచి పాల సేకరణ జరుగుతుంది. ఆ పాలు ఫ్యాక్టరీకి చేరే వరకు ఓ విభాగం పని చేస్తే, పాలను ప్యాకెట్లుగా చేసి అవి వినియోగదారుడికి చేరే వరకు మరో విభాగం పని చేస్తుంది. ఆయా విభాగాల్లో పాలు వినియోగదారుడికి చేరవేయడంలో కాంట్రాక్టు సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఒక వైపున ఉపాధిని చూపించే ఫ్యాక్టరీ ముంపునకు గురి కావడం, మరో పక్క ఇళ్లలోకి వరద నీరు చేయడంతో సర్వం కోల్పోయిన సిబ్బంది బాధ వర్ణనాతీతంగా మారింది.



వరద ముంపులో విజయ డెయిరీ


మరమ్మతుల పనుల్లో నిమగ్నం

వరద నీరు పాల ప్రాజెక్టులోకి భారీగా చేరడంతో రూ.65 కోట్ల మేర పాలు, పాల పదార్థాలు నీటిపాలయ్యాయి. వీటితో పాటు కూలింగ్ యంత్రాలు, జనరేటర్లు, ప్యాకింగ్ యంత్రాల్లోకి నీరు చేరి పాడైపోయాయి. పాలు, పాల ఉత్పత్తులను ప్యాకింగ్ చేసే మెటీరియల్ వరద నీటి పాలైంది. మరో వైపున పాలప్రాజెక్టు ఆవరణలో ఉన్న పరిపాలనా విభాగం ముంపునకు గురైంది. ఫ్యాక్టరీ, గోడౌన్లు, పరిపాలనా భవనం ఇలా మొత్తంగా సుమారు రూ.వంద కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. రోజుకు రెండు లక్షల లీటర్ల పాల ప్యాకెట్లను సిద్ధం చేసే మిషనరీ పూర్తిగా దెబ్బతినగా, పాలు, పెరుగుతో తయారైన ఉత్పత్తులు నీటి పాలయ్యాయి. వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటుండగా, ఇంజినీరింగ్ అధికారులు మిషనరీ మరమ్మతుల పనుల్లో నిమగ్నమయ్యారు.

కామధేను ఆదుకుంది : చైర్మన్ చలసాని

రోజుకు 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో వీరవల్లి వద్ద నూతనంగా నిర్మించిన కామధేను ఆదుకుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో వినియోగదారులకు అవసరమైన పాలను సకాలంలో సరఫరా చేయగలిగాం. ఎన్టీఆర్ జిల్లాలో పలు గ్రామాలను వరద ముంచెత్తినా పాల సేకరణను సమర్థవంతంగా చేయడంతో పాటు పాలను కామధేనుకు తరలించడంలో సఫలీకృతులమయ్యాం.


బయట పనులకు వెళ్తున్నా..



పాల ప్రాజెక్టులో పాలు టబ్‌లో సర్దే పనికి వెళ్తాను. వరదతో గత పది రోజులుగా పని లేదు. నేను ఒంటరిని. నాకు వచ్చే ఆదాయమే ఆధారం. ఇక చేసేది లేక బయట పనులకు వెళ్తున్నా. మా ఫ్యాక్టరీ త్వరగా బాగవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

–మల్లేశ్వరి, కార్మికురాలు

ప్రభుత్వం ఆదుకోవాలి..



మాకు ముగ్గురు ఆడపిల్లలు. ఫ్యాక్టరీలో పాల డబ్బాలు శుభ్రం చేసే చోట పని చేస్తుంటా. నాకు వచ్చే జీతం... నా భర్తకు, కుటుంబానికి కొంత ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పుడు పని లేకపోతే మా కుటుంబానికి భారమే. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సుజాత, కార్మికురాలు

మురుగుతోనే సహజీవనం

- సర్వం కోల్పోయి రోడ్డున పడిన బాధితులు
- తాగునీరు, ఆహారం లేక ఇబ్బందులు
- ప్రభుత్వం ఆదుకోవాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపు తమ జీవితాలను తారుమారు చేసిందని పాత ఆర్‌ఆర్‌పేట ప్రాంత వాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కనీసం వరద వస్తుందనే ముందస్తు సమాచారం అధికారులు అందించి ఉంటే కొన్ని వస్తువులనైనా కాపాడుకునే వారమని తెలిపారు. ముంపునకు గురై ఎనిమిది రోజులు గడుస్తున్నా ఇప్పుడు కూడా తమ ఇళ్ల చుట్టూ మురుగు నీరు, వ్యర్థాలు చేరి ఎక్కడ వ్యాధులకు గురవుతామోనని భయపడాల్సి వస్తుందని వాపోతున్నారు. బీరువాల కంపెనీ రోడ్డు, సాయిబాబా గుడివీధి, సుబ్బరాజు కాలనీ, మహంకాళమ్మగుడి వీధి, అల్లు అప్పలరాజువీధి తదితర ప్రాంతాలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. ఇళ్లలోని పనికిరాని వస్తువులు, ప్రవాహంలో కొట్టుకువచ్చిన వ్యర్థాలతో ఆయా వీధులు తీవ్ర దుర్గంధం నెలకొంది.



ముంపులోనే పాత ఆర్‌ఆర్‌పేటలోని పలు వీధులు

బతుకుతానని అనుకోలేదు



గత ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వరద ప్రవాహం పోటెత్తటంతో ప్రాణ భయంతో ఇంట్లోని వస్తువులను వదలిపెట్టి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాను. ఇంతలోనే వరద తాకిడి ఎక్కువవడంతో ఆ నీళ్లలో కొట్టుకుపోతున్న నన్ను కొందరు వ్యక్తులు చూసి రక్షించారు. బతుకుజీవుడా అంటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బంధువుల ఇంట్లో తలదాచుకున్నాను.

–జట్టి లీలాకుమారి, సుబ్బరాజు కాలనీ, పాత ఆర్‌ఆర్‌పేట

సర్వం కోల్పోయాం..



వరద వస్తుందనే సమాచారం లేకపోవడంతోనే ఒక్క సారిగా వరద మా ఇంటిని ముంచెత్తటందో పై అంతస్తులో తలదాచుకున్నాము. కానీ మా ఇంట్లోని వస్తువులు, బట్టలు, మంచాలు, విద్యుత్ గృహోపకరణాలు అన్నీ నీట మునిగి పనికి కాకుండా పోయాయి. తాగునీరు, ఆహారం కూడా లేక ఇబ్బందులు పడ్డాము. తరువాత నుంచి మా పిల్లలు నడుం లోతు నీళ్లలో బయటకు వెళ్లి తాగునీరు, ఆహారం తీసుకొస్తే వాటితోనే బతికాము. ప్రభుత్వమే ఆదుకోవాలి.

–జి. నారాయణరావు, అల్లు అప్పలనాయుడు వీధి, పాత ఆర్‌ఆర్‌పేట

దుర్వాసనతో బాధితుల బెంబేలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గత 9 రోజులుగా వరద నీటిలో తీవ్ర ఇబ్బందులకు గురైన జక్కంపూడి కాలనీ వాసులకు ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. కాలనీలో వరద నీరు తగ్గుముఖం పట్టడం, ఖాళీ స్థలాలు, వరద ప్రవాహంతో రోడ్డుపై అక్కడక్కడ ఏర్పడిన గోతులలో వరద నీరు నిల్వ ఉండి పోవడంతో ఆ వరద నీటి నుంచి భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో కాలనీ వాసులు బురదతో ఉన్న తమ ఇళ్లలో, ఇంటి ముందు ఉన్న వరద నీటిని ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కాలనీ బ్లాకుల మధ్య ఉన్న ఖాళీ స్థలంలోకి చెత్త, వ్యర్థాలు నిలిచిపోవడంతో వాటిని తొలగించడం తలకు మించిన భారంగా మారిపోయిందని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద నీటి నుంచి భరించలేని దుర్వాసన రావడంతో కడుపులో తిప్పేస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలతో ఇళ్ల ముందు నిల్చోలేకపోతున్నామంటున్నారు. ఇప్పటికే వారం, పది రోజులుగా వరద నీటిలో ఉండటం వల్ల కాళ్లపై పొక్కులు, దద్దుర్లు, ఇతర చర్మవ్యాధులు వస్తున్నాయని వాపోతున్నారు. ఈ దుర్వాసన, పేరుకుపోయిన చెత్తతో రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. కాలనీ బయట ఏర్పాటు చేసిన మొబైల్ హాస్పిటల్స్‌ను లోపల నాలుగు రోడ్ల కూడళ్లలో ఏర్పాటు చేయించాలని అధికారులను కోరుతున్నారు.



జక్కంపూడి కాలనీలో నిల్వ ఉన్న వరద నీరు

నాట్య గణపతిగా బాలగణపతి దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి మందిరంలో స్వామి వారు నాట్య గణపతిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ బాలగణపతి మందిరంలో జరుగుతున్న 39వ గణపతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు సోమవారం విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమిళనాడు నుంచి వచ్చిన కళాకారులు స్వామి వారిని అత్యంత రమణీయంగా అలంకరించారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పలు విశేష వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారికి మధ్యాహ్నం సహస్ర మోదక (ఉండ్రాళ్లు) పూజా కార్యక్రమాన్ని, సహస్ర నామార్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవ కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకట కృష్ణారావులు పర్యవేక్షించారు.



నాట్య గణపతి

గణపతి ఆకృతుల కలెక్షన్ పోటీలు

ఉత్సవాల్లో భాగంగా మందిరంలో రోటరీ క్లబ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో గణపతి ఆకృతుల కలెక్షన్(ఎగ్జిబిషన్) పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఈ పోటీలో పాల్గొని చక్కని ఆకృతులను ప్రదర్శించారు. విభిన్నమైన ఆకృతులు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకూ పోటీలు కొనసాగాయి. ఈ సందర్భంగా మందిరం ప్రాంగణం, స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న భగవన్నామ సంకీర్తన

శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో గణపతి సహస్రనామ పారాయణం, భగవన్నామ సంకీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గంటలపాటు జరిగిన ఈ కార్యక్రమం అలరించింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సంకీర్తనా గానంలో పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మందిరంలో చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో చోరీ జరిగింది. మందిరం గేటుతాళం పగులకొట్టి ఆలయంలోని సీసీ కెమేరాలు, డీవీఆర్ బాక్సు, హార్డు డిస్కులను దుండగులు ఎత్తుకువెళ్లారు. అలాగే హుండీని పగుల కొట్టి సొమ్ము దొంగిలించారు. గతంలో కూడా ఇక్కడ ఆలయంలోని గ్యాస్ సిలిండర్‌లు, గ్యాస్‌స్టవ్‌లు చోరీ అయ్యాయి. దీంతో ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు సీసీ కెమెరాలను సైతం ఎత్తుకుపోవటం గమనార్హం. మందిరంలోని సోఫా చినిగిపోయి గేటు తాళం పగులకొట్టి ఉందని మందిర వ్యవస్థాపకుడు బల్లెం పూర్ణయ్యస్వామికి సమాచారం అందింది. దీంతో ఆయన మందిరానికి చేరుకుని పరీక్షించగా మందిరంలోని హుండీ పగులకొట్టి ఉంది. అలాగే ఆలయంలోని సీసీ కెమెరాలు, డీవీఆర్, హార్డ్‌డిస్కులు మాయమయ్యాయి. దీంతో ఆయన సూర్యారావుపేట పోలీసులను ఆశ్రయించారు.

